క్లుప్తంగా

7న విగ్రహాల ప్రతిష్ట



దుమ్ములగడ్డలో ప్రతిష్టించనున్న కనకదుర్గమ్మ రాతి విగ్రహం

అడ్డతీగల: మారుమూల గిరిజన గ్రామమైన వై.రామవరం మండలం దుమ్ములగడ్డ నడిబొడ్డున ఈనెల 7 న కనకదుర్గమ్మ, నాగశివలింగం ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. ఈ రాతి విగ్రహాలను ఒంగోలుకి చెందిన శివప్రసాద్ కనకదుర్గమ్మ విగ్రహాన్ని , నాగశివలింగాన్ని పవనగిరి తరపున అందజేస్తున్నామన్నారు. ఆ రోజు వేకువజాము నుంచే శాస్త్రోక్తంగా నవగ్రహ మండపం, గణపతి పూజ,శివ శ్రీ దుర్గ గాయత్రీ హోమం తదితర పూజలు నిర్వహించి విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు తణుకు వెంకటరామయ్య చెప్పారు.ఎనిమిది గ్రామాలకు శివలింగాలను ఉచితంగా పవనగిరి తరపున అందజేయనున్నట్టు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అరకులోయ రూరల్: గురుకులం వసతి గృహాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బాలదేవ్ మంగళవారం కోరారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో హెచ్ఎన్‌టిసి కార్మికులుగా పనిచేస్తున్న వారికి ఉన్నతాధికారులు స్పందించి వేతన బకాయిలు అందేలా చూడాలని పేర్కొన్నారు. కార్మికుల శాశ్వత సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్మికులు కొండలరావు, బుద్ధు, సుంక్ర తదితరులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం

డుంబ్రిగుడ: మండలంలోని రెండు రోజుల నుంచి భారీ వర్షం కురుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురవడంతో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రహదారులు జలమయమయ్యాయి. గిరిజనులు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన గిరిజనులు గెడ్డలు దాటుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని నియోజకవర్గ స్థాయి టీడీపీ బూత్ కమిటీ సభ్యుల శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలన్నారు. గత టీడీపీ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలన్నారు. నాయకులు శ్రావణ్‌కుమార్, అబ్రహం, దొన్నుదొర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌వో మృతికి సంతాపం

రంపచోడవరం: వై.రామవరం మండలం కోట వీఆర్‌ఓ గుత్తుల విష్ణుమూర్తి ఆకాల మరణానికి రంపచోడవరం డివిజన్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ప్రతినిధులు మంగళవారం సంతాపం వ్యక్తం చేశారు. వీఆర్‌వో విష్ణుమూర్తి అందించిన సేవలు మరువలేనివని ప్రకటనలో పేర్కొన్నారు.

రోగికి డోలీమోత



రోగిని డోలీలో తరలిస్తున్న కుటుంబీకులు

అనంతగిరి: మండలంలోని గుమ్మ పంచాయతీ కర్రిగూడ గ్రామానికి చెందిన సి.శాంతి(19) అనే గిరిజన యువతికి మంగళవారం ఆకస్మాత్తుగా గుండెనొప్పి వచ్చింది. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడం కుటుంబ సభ్యులు వెను వెంటనే కర్రిగూడ నుంచి గుమ్మ వరకు సమారు ఆరు కిలో మీటర్లు డోలీ మోతపై శాంతిని తీసుకునివచ్చారు. అనంతరం ఆటోలోని ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం పరిస్థితి మెరుగ్గా ఉందని, కుటుంబ సభ్యులు తెలిపారు. అధికారులు స్పందించి, గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్నకే సాధ్యం



ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



ఊట్ల గ్రామంలో స్థానికులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల సంక్షేమానికి ఎంతో శ్రమిస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. పాడేరు-1 సచివాలయం పరిధిలోని ఐటీడీఏ వెనుక రేకులకాలనీ, సిల్వర్‌నగర్, ముల్లుమెట్ట గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లోని 123 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ పథకాలతో కూడిన బ్రోచర్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పార్టీలు, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఏజెన్సీలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా గ్రామాల్లో సమస్యలను తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని అధికారులు, సచివాలయ ఉద్యోగులను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆదేశించారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, ఎంపీటీసీ సభ్యులు గిడ్డి విజయలక్ష్మి, చల్లా చిట్టమ్మ, నరసింహమూర్తి, రామకృష్ణపాత్రుడు, సర్పంచ్‌లు నీలకంఠం, చిట్టిబాబు, నాయకులు మోద బాబూరావు, కన్నాపాత్రుడు, కొండమ్మ, ఉర్వశిరాణి, సుశీల, లక్ష్మి, నాగేంద్ర, సతీష్, లక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లకే రామ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

రంపచోడవరం: ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని ఊట్ల సచివాలయం పరిధిలో ఊట్ల, రామన్నపాలెం గ్రామాల్లో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి యోగ క్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పారదర్శంగా, పార్టీలకతీతంగా, పథకాలు అమలుచేస్తూ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు తెలియజేశారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, పార్టీ మండల కన్వీనర్, సొసైటీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డ్ సభ్యులు, సచివాలయం కన్వీనర్లు గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు తదితరులు

వీఆర్ పురం: మండలంలోని రేఖపల్లి గ్రామంలో ఎన్నో ఎళ్లుగా గిరిజనులు సాగుచేసుకుంటున్న డీ-ఫారం భూములకు హక్కుపత్రాలు మంజూరు చేసేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సుముఖత వ్యక్తం చేశారని ఎటపాక డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు అన్నారు. పాడేరులోని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సంబంధిత రైతులతో జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యలు విన్నవించుకున్నట్టు ఆయన తెలిపారు. సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు. రేఖపల్లి గ్రామాన్ని ప్రయారిటీ లిస్ట్‌లో చేర్చి పోలవరం ఆర్‌అండ్‌ఆర్ సర్వే చేయించేలా చర్యలు చేపట్టాలని కూడా వినతి అందచేశామన్నారు. రైతులు పెదవెంకటేష్, కన్నంరాజులు, వెంకటలక్ష్మి, నాగమ్మ, నాగేశ్వరరావు, వెంకటరమణ తదితరులున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ నీలకంఠం నేతలు

ముంచంగిపుట్టు: గిరిజన యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని సర్పంచ్ నీలకంఠం అన్నారు.మండలంలో గల జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో శ్రీకనక దుర్గా అమ్మవారి మహోత్సవాలు సందర్భంగా డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సర్పంచ్ నీలకంఠం, వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ నీలకంఠం మాట్లాడుతూ గిరిజన యువత అన్ని రంగాల్లో సత్తా చూపించాలని, ప్రతిభను సానబెడితే ఉన్నత ఫలితాలు వస్తాయని, గ్రామాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. నాయకులు జగబందు, ఎండి సులేమాన్, భగత్‌రాం, మణి, టోర్నీ నిర్వాహకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మన్యం రహదారులకు మహర్దశ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని సంతబైయాలులో జిల్లా పరిషత్ నిధులు రూ.5లక్షలతో 50 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు, జెడ్పీ చైర్ పర్సన్ భర్త జల్లిపల్లి మూర్తి, సర్పంచ్‌లు, నాయకులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మన్యంలో గిరిజన గ్రామాలకు మహర్దశ నెలకొందని ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించి రవాణా వ్యవస్థను మెరుగు పరచాలని ప్రభుత్వం కంకణం కట్టుకొందన్నారు. ఎన్నో ఏళ్ల తరబడి అధ్వాన రహదారితో అవస్థలు పడ్డ గిరిజనులకు జెడ్పీ నిధులతో రహదారులు మంజూరు చేస్తూ వారి కష్టాలను తీరుస్తున్నమన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మారుమూల గిరిజనులు రవాణా కష్టాలు పడ్డారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏజెన్సీలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. ప్రజలంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్‌లు సుభాష్, రమేష్, నరసింగరావు, బాబూరావు, ఎంపీటీసీ లబ్బో, నేతలు జగబందు, తిరుపతిరావు, రామ్మూర్తి, సురేష్, బాలరాజు, దాసు, సన్యాసిరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత మూర్తి తదితరులు

విరిసిన ఇంద్రధనస్సు



ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా వాతావరణం మబ్బులతో కూడి చిరుజల్లులు కురుస్తున్న వేళ ఆకాశంలో తూర్పువైపున ఇంద్రధనస్సు విరిసింది. మంగళవారం ఇందుకూరుపేటలో కనిపించిన ఈ సుందర మనోహరమైన హరివిల్లు చూపరులను ఆకట్టుకుంది. - దేవీపట్నం

అంగరంగ వైభవం.. అమ్మవార్ల ఉత్సవం

- 11 ఏళ్ల తర్వాత తారువ మర్లమాంబ పెద్ద పండగ
- ఆర్లి, ఎ.భీమవరంలో గ్రామదేవతల ఉత్సవాలు



తారువలోని మర్లమాంబ సన్నిధిలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దంపతులు

దేవరాపల్లి: తారువ ప్రజల ఆరాధ్య దైవం శ్రీమర్లమాంబ అమ్మవారి పెద్ద పండగ మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. 11 ఏళ్ల తర్వాత జరిగిన అమ్మవారి జాతరకు భారీగా భక్తజనం తరలివచ్చారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి మర్లమాంబ అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. ఆలయానికి విచ్చేసిన భక్తజనాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ రోజంతా అమ్మవారి సన్నిధిలోనే గడిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లను స్వయంగా ఆయనే పర్యవేక్షించారు. రాత్రికి ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తజనాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి.

కె.కోటపాడు: ఆర్లి గ్రామంలో పైడితల్లమ్మ, ఎ.భీమవరంలో మరిడి మాంబ అమ్మవార్ల పెద్ద పండగలను గ్రామస్తులు మంగళవారం ఘనంగా జరిపారు. ఐదేళ్లకోసారి రెండు గ్రామాల్లో అమ్మవార్ల పెద్ద పండగలను జరపడం ను ఆనవాయితీగా వస్తోంది. పండగ నేపథ్యంలో రెండు గ్రామాలకు పెద్ద సంఖ్యలో బంధువులు, స్నేహితుల రాకతో గ్రామాల్లో సందడి నెలకొంది. ఇరువురు అమ్మవార్లను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామాల్లో ప్రజలు ఐక్యతతో పండగలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్‌లు తర్రా సన్యాసమ్మ, శేషు, బోళం సందీప్, బోళం కృష్ణారావు పాల్గొన్నారు.

ఘనంగా గజ్జాలమ్మ పండగ

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట మండలం ఎల్.శింగవరం గ్రామ దేవత గజ్జాలమ్మ పండగ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని గ్రామస్తులంతా ప్రత్యేక పూజలు చేశారు. పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పందెం ఆకట్టుకుంది. పందెంలో గెలుపొందిన విజేతలకు నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులను అందించారు. రాత్రికి ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని అలరించాయి.

5న వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట



కొత్తగా నిర్మించిన వీరబ్రహ్మేంద్ర ఆలయం

మాకవరపాలెం: మండల కేంద్రంలోని కొత్త వీధిలో నిర్మించిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 5న విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంతం ఆదినారాయణ, ఆరిపాక శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి ఆలయం వద్ద ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ట రోజున కల్యాణం జరిపి, మధ్యాహ్నం అన్నసమారాధనకు ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

కోటమ్మతల్లి గరగల ఉత్సవం



నాతవరంలో ఊరేగిస్తున్న కోటమ్మతల్లి గరగలు

నాతవరం: మండల కేంద్రంలో మంగళవారం శ్రీకోటమ్మతల్లి పండగకు గరగల ఉత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. గ్రామస్తులు కోటమ్మతల్లిని గ్రామ దేవతగా పూజిస్తూ, మూడేళ్లకోసారి పండగ నిర్వహిస్తారు. సంప్రదాయం మేరకు ఈ ఏడాది కూడా అమ్మవారి పండగను ఈ నెల 30న నిర్వహించేందుకు గ్రామపెద్దలు నిర్ణయించారు. అందులో భాగంగా గరగల ఉత్సవాన్ని ప్రారంభించి, గ్రామ వీధుల్లో ఊరేగించారు.

వైభవంగా పైడితల్లమ్మ పండగ



ఎడ్లబళ్ల పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

కశింకోట: కన్నూరుపాలెం గ్రామంలో పైడితల్లమ్మ పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో పాల్గొని ఎడ్ల బళ్ల పరుగు పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. పోటీలను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు, మండల పార్టీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు సర్పంచ్‌లు గున్నయ్యనాయుడు, శివ, చిరికి సత్యనారాయణ, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి పనులు



అప్పలరాజుపేటలో మట్టి రోడ్డు పనుల్లో ఉపాధి వేతనదారులు

రాజవొమ్మంగి: రెక్కాడితే కాని డొక్కాడని కష్టజీవులను ఉపాధి హామీ పనులు ఊరూరా ఒక వరంలా ఆదుకొంటున్నాయి. పనుల కోసం పొట్ట చేత పట్టుకొని సుదూర ప్రాంతాలకు వలసలు పోకుండా ఉన్న ఊర్లోనే ఉపాధి కల్పిస్తున్నాయి. రాజవొమ్మంగి మండల వ్యాప్తంగా ఈ వేసవిలో ఉపాధి హామీ పనులు ఊపందుకొన్నాయి.

ఈ ఏడాది మరిన్ని పనులు చేరడంతో వాటిని వేతనదారులు ఒక్కటొక్కటిగా పూర్తి చేస్తున్నారు. మండలంలో ప్రస్తుతం ఎక్కడ చూసినా సాగునీటి చెరువుల పూడిక తీత, మట్టిరోడ్ల ఏర్పాటు, పంటకాలువలు, జీడిమామిడి తోటల పెంపకం, చెట్ల చుట్టు వర్షపు నీరు ఇంకేందుకు కందకాల తవ్వకం, భూమి చదును (ల్యాండ్ లెవెలింగ్) పనులు పనులను ప్రోత్సహిస్తున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 9,228 జాబ్‌కార్డులున్నారు. తద్వారా 15,523 మంది ఉపాధి పనులకు ఉపయోగించుకోనున్నట్టు సమాచారం. రోజువారీ పనులకు రావాల్సిన వారి సంఖ్య (లక్ష్యం) 4,902 మంది కాగా ప్రస్తుతం 3,448 మంది పనులకు వస్తున్నట్టు తెలిసింది. వేతనదారుల సంఖ్యను పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. మండలంలో 2,987 పనులను గుర్తించగా పరిపాలనా పరమైన ఆమోదం లభించిందని, నిధులు సిద్ధంగా ఉన్నట్టు తెలిసింది. ఈ ఏడాది మండలంలో 5లక్షల 37వేల పనిదినాలు కల్పించాలన్నది లక్ష్యంగా ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృథాగా నీరు.. పట్టించుకోరూ...



వట్టిగెడ్డ రిజర్వాయర్ ఎడమ గట్టుకు గండిపడడంతో వృథాగా పోతున్న సాగునీరు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి శివార్లలోని వట్టిగెడ్డ రిజర్వాయర్ స్లూయిజ్, పంటకాలువకు ఈ వేసవిలో మరమ్మతులు చేపట్టి ఆయకట్టు శివారు భూములకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. నిత్యం పుష్కలంగా నీరు ఉండే ఈ రిజర్వాయర్ గల ప్రధాన స్లూయిజ్, పంటకాలువ దెబ్బతినడంతో నిరుపయోగంగా మారిందని చెబుతున్నారు. సుమారు 5 కిలోమీటర్ల పొడవున గల ఈ పంటకాలువ ద్వారా 8 గ్రామాల్లో దాదాపు 3 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. అయితే పంట కాలువ ప్రారంభంలో సుమారు 200 మీటర్ల పొడవునా ఎడమ గట్టు బలహీనంగా తయారైందని , దీని వల్ల కాలువలోకి నీరు వదిలినప్పుడల్లా గండి పడి దిగువ పొలాలు ముంపునకు గురికావడమే కాక ఆయకట్టు శివారు భూములను సాగునీరు అందని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఖరీఫ్‌లో ఏటా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. ఈ గట్టుకు సిమెంట్ కాంక్రీటుతో రిటైనింగ్ వాల్ నిర్మిస్తే సాగునీరు పూర్తి స్థాయిలో దిగువకు ప్రవహించే వీలు ఉంటుందని చెబుతున్నారు. వర్షాధారంగానే వరి నాట్లు వేసుకోవాల్సిన దుస్థితి ఉందంటున్నారు. ఈ రిజర్వాయర్‌కు గల స్లూయిజ్, షట్టర్లకు మరమ్మతు చేసి, సాగునీటి కాలువల్లో పూడికతీత చేపట్టి శివారు భూములకు పూర్తిస్థాయిలో నీరందేలా చూడాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

చింతూరులో రేపు సీపీఎం మహాసభ



ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నాయకులు

రాజవొమ్మంగి: చింతూరులో వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 4న జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం రంపచోడవరం కార్యదర్శి వర్గ సభ్యుడు లోతా రామారావు, మండల నాయకుడు కొండ్ల సూరిబాబు పిలుపునిచ్చారు. మహాసభ ప్రచార నిమిత్తం మండలంలోని లోదొడ్డి గ్రామం నుంచి కొమరాపురం మీదుగా రాజవొమ్మంగి వరకు బైక్ ర్యాలీ జరిగింది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నట్టు తెలిపారు. నాయకులు జగన్నాథం , రామరాజు, రాజు, రమేష్, మురళి, సత్యన్నారాయణ, సింహాద్రి, శేఖర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అమ్మవారి జాతర

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ యర్రవరం గ్రామంలో మంగళవారం పరదేశమ్మ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి భక్తులు పరదేశమ్మ తల్లి దర్శనానికి తరలివచ్చి పసుపు, కుంకుమ చీరలతో మొక్కులు చెల్లించుకున్నారు. సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని బంతి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, వార్డు కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక ఆకర్షణగా బాణసంచా, విద్యుదలంకరణలు ఏర్పాటు చేశారు.

ఘనంగా పైడిమాంబ అమ్మవారి పండగ

మునగపాక : మండలంలోని ఒంపోలు గ్రామంలో మంగళవారం పైడిమాంబ అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. వేసవి కాలం కావడంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఆలయ కమిటీ తగు చర్యలు తీసుకుంది. అలాగే గ్రామంలో నేల వేషాలు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.